క్లుప్తంగా

ఉత్సవాలకు శుభరాట


శుభరాట పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కంచిలి: మండలంలోని తలతంపర గ్రామంలో వెలసిన సింధుపటరాణి గ్రామదేవత ఉత్సవాల శుభరాట కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. 42 సంవత్సరాలు తర్వాత ఈ ఉత్సవాలను చేపట్టనున్న నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ శుభరాట కార్యక్రమాన్ని సర్పంచ్ జగబంధు దొళాయి దంపతుల చేతులమీదుగా చేపట్టారు. కార్యక్రమంలో గ్రామస్తులంతా పాల్గొన్నారు.

పరామర్శ


జోగారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న పిరియా విజయ తదితరులు

సోంపేట: మండలంలోని పలాసపురం గ్రామంలో జెడ్పీటీసీ తడక యశోద అత్త, సర్పంచ్ తడక జోగారావు తల్లి తడక అన్నపూర్ణమ్మ శుక్రవారం మృతి చెందింది. దీంతో వారి కుటుంబాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆదివారం పరామర్శించారు. ఆమెతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

ప్రవేశ పరీక్ష నేడు

సోంపేట: స్థానిక ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో చేరడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు ఒరిజనల్ ఆధార్ కార్డు తీసుకు రావాలని సూచించారు. హాల్ టికెట్‌పై ఫొటో లేనివారు రెండు ఫొటోలు తీసుకురావాలన్నారు.

మండల పరిషత్ నిధులతో అభివృద్ధి


ఎంపీపీ దాస్‌ను సన్మానిస్తున్న సంఘ ప్రతినిధులు

సోంపేట: మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. మండలంలోని జింకిభద్ర గ్రామంలో ఎంపీపీ నిధుల ప్రోత్సాహంతో నిర్మాణం చేపట్టిన అగ్నికుల క్షత్రియ సంఘ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అగ్నికుల క్షత్రియ సంఘ ప్రతినిధులు డాక్టర్ నిమ్మన దాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తామాడ పద్మావతి, ఉప సర్పంచ్ సాహుకారి జాని, వార్డు మెంబర్లు పెద్దకోట అనంత్, తామాడ సూర్యనారాయణ, తామడ వెంకటరావు, కూనే లోకనాథ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించాలి


విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

పలాస: విద్యార్థులు తమ తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని విశ్రాంత ఉపాధ్యాయులు అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలో ఉన్న జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతి చెందిన ఉపాధ్యాయులకు అంజలి ఘటించారు. విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కణితి సూర్యనారాయణ, గరుగు సింహాచలం, ఉపాధ్యాయులు పొట్నూరు మురళి, కృష్ణ, బమ్మిడి కుసురాజు, ప్రసాదరావు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా మట్టి తరలింపు


నిర్లక్ష్యంగా మట్టిని తరలిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస – మందస మండలాల మధ్య టిప్పర్ లారీలతో ఆదివారం నిర్లక్ష్యంగా మట్టిని తరలించారు. కనీసం మట్టిపై ఎటువంటి పరదాలు కప్పకపోవడం వలన గాలికి ఎగరడంతో వెనుకన వచ్చే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. దీంతో కొంతమంది లారీలను నిలుపుదల చేసి ప్రశ్నించారు. అధికారులు తక్షణమే స్పందించి ఇటువంటి లారీలపై చర్యలు చేపట్టాలని కోరారు.

రండి బాబూ రండి..
మా బడిలో చేరండి..!

- అడ్మిషన్ల కోసం ఇంటింటికీ ఉపాధ్యాయులు
- రాయితీలు కల్పిస్తామని ప్రైవేటు పాఠశాలల పోటీ ప్రచారం
- తలలు పట్టుకుంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు


పిల్లలను చేర్పించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులను కోరుతున్న ఉపాధ్యాయులు


ఉపాధి పని ప్రదేశంలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం రూరల్: తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం ఎన్ని అప్పులు చేసైనా మంచి బడిలో చదివించాలనుకుంటారు. ఉన్నత విద్య కోసం రూ.లక్షలు ఖర్చు చేస్తారు. దీన్ని ఆసరాగా చేసుకున్న ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు ముందుగా ప్రవేశాలు పొందితే రాయితీలు కల్పిస్తామంటూ చెబుతుంటాయి. దీంతో సర్కారు బడుల్లో రానురాను విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుండడంతో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు అడ్మిషన్ల కోసం నేరుగా విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి మీ పిల్లల్ని మా బడిలో చేర్పించండి అంటూ ప్రాధేయపడాల్సి వస్తోంది. 2025–26 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ల సంఖ్యను పెంచుకోవాలన్న ఉద్దేశంతో ఇప్పటికే ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ప్రత్యేకంగా తయారు చేసిన కరపత్రాలు, ఫ్లెక్సీలను గ్రామాల్లో ప్రదర్శిస్తున్నారు. మండల విద్యాశాఖాధికారులతో పాటు పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఉపాధి హామీ పథకం వద్దకు సైతం వెళ్లి అక్కడ పనులు చేసే వేతనదారులకు సర్కారు బడుల్లో ఉండే వసతులు, విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమంపై తెలియజేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల మనుగడ కోసం అక్కడి వసతులను వివరిస్తున్నారు.

తల్లిదండ్రుల విముఖత

నిత్యం సర్కారు బడుల్లో సెలవులు ఉంటాయని, మొన్నటి వరకు ఉన్నటువంటి ఇంగ్లిష్ మీడియం చదువులకు స్వస్తి పలికారని, 8వ తరగతి విద్యార్థులకు గత ప్రభుత్వ హయాంలో ట్యాబ్‌లు ఇచ్చేవారని, ప్రస్తుతం అటువంటివి ఏమీ లేకపోవడంతో తల్లిదండ్రులు విముఖత చూపిస్తున్నారు. అదే సమయంలో గ్రామాలకు బస్సులు, ఆటోలు వేస్తామని, ఇంగ్లిష్ మీడియం అందిస్తామని ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు చేస్తున్న ప్రచారాలు విద్యార్థుల తల్లిదండ్రులపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో అధిక శాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు బడుల్లో చేరించేందుకు సిద్ధపడుతున్నారు. అదే సమయంలో ప్రైవేటు స్కూల్ యాజమాన్యాల ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులకు తల ప్రాణం తోకకు వస్తోంది. ఇదిలా ఉండగా ఐదేళ్లు నిండితేనే ప్రభుత్వ బడుల్లో పిల్లల్ని చేరిపించాలన్న విద్యాశాఖ నిబంధనలు ఉపాధ్యాయులకు తలనొప్పి తెప్పిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే ఐదేళ్లలోపు చిన్నారులను ప్రైవేటు స్కూల్ యాజమాన్యాల ఎల్‌కేజీ, యూకేజీ పేరిట చేర్చుకుంటుండడంతో పిల్లాడికి ఐదేళ్లు నిండే నాటికి పూర్తిగా ప్రైవేటు స్కూలుకే పరిమితమైపోతున్నాడని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇచ్ఛాపురం గవర్నమెంట్ స్కూల్ ప్రచురించిన కరపత్రం

ఐదేళ్ల నిబంధన సడలించాలి



ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల చేరికలు పెరగాలంటే ప్రభుత్వం ఐదేళ్ల నిబంధన సడలించాలి. మూడున్నరేళ్ల పిల్లల్ని ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు ఎల్‌కేజీ, యూకేజీ పేరుతో చేర్చుకుంటున్నాయి. దీంతో ప్రభుత్వ బడుల్లో ఒకటో తరగతిలో చేరేందుకు పిల్లలు దొరకడం కష్టతరంగా మారుతోంది. ఐదేళ్ల నిబంధనపై విద్యాశాఖ పునరాలోచించాలి.

– కీలు సోమేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్)

అవగాహన కల్పిస్తున్నాం



పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేరిపించేందుకు ఉపాధ్యాయులు శతవిధాలుగా శ్రమిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు నేరుగా వెళ్లి వాళ్లకు సర్కారు బడుల్లో అందుతున్న పథకాలు, చదువుపై అవగాహన కల్పిస్తుండడంతో అడ్మిషన్లు బాగా జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉపాధి పనులు జరుగుతుండడంతో తప్పని పరిస్థితుల్లో పని ప్రదేశంకు వెళ్లి తమ పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరుతున్నాం.

– కురమాన అప్పారావు, ఎంఈవో, ఇచ్ఛాపురం

సుడా సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధి

- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు


సోంపేట: వ్యవసాయ శాఖ భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు

ఇచ్ఛాపురం/ఇచ్ఛాపురం టౌన్: సుడా సహకారంతో ఇచ్ఛాపురం మున్సిపాలిటీ అభివృద్ధి చేసేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సూచించారు. పట్టణంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీరు, సాగునీటికి ఎటువంటి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సాగునీటి సమస్యలను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించేలా చూడాలని, దీనికి సంబంధించి నీటిసంఘం సభ్యులు పూర్తి సహకారం అందించాలని సూచించారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో పార్కులు, శానిటేషన్, సెంట్రల్ లైటింగ్ వంటివి అభివృద్ధి చేసి, ఆంధ్ర రాష్ట్రానికి ముఖద్వారంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్.రమేష్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కస్పా మహంతి వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే బెల్లుపడలో జరుగుతున్న శ్రీరామతారక మహామంత్ర సహిత పంచకుండాత్మక యజ్ఞంలో పాల్గొన్నారు.

భవన సముదాయం ప్రారంభం

సోంపేట: సోంపేటలో వ్యవసాయశాఖ కార్యాలయం, గోదాము భవన సముదాయాన్ని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌లు కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని రైతులు, వ్యవసాయ సిబ్బందికి భవన సముదాయం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం అందించాలి


మాట్లాడుతున్న శిష్టు గోపి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి సూదికొండ ప్రాంతంలో నిరుపేదల ఇళ్లను కూటమి ప్రభుత్వం తొలగించిందని పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శిష్టు గోపి ఆరోపించారు. ఆదివారం సూదికొండ ప్రాంతంలో ఆయన మాట్లాడుతూ.. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే కేంద్రీయ విద్యాలయం మంజూరైందని కట్టుకథతో స్థలాలు ఆక్రమిస్తున్నారని మండిపడ్డారు. అక్కడ లభించే కంకరను అక్రమంగా అమ్ముకుంటున్నారన్నారు. బాధితులకు నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే అక్రమంగా గ్రావెల్ అమ్మకాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. సూదికొండపై ఎవరైనా మాట్లాడితే కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రజలు, ఉద్యమకారులను భయపెట్టి ప్రభుత్వాలు నడపాలనుకోవడం సరికాదన్నారు. సూదికొండ బాధితులకు న్యాయం జరిగేంతవరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.

చెత్త తరలింపులో నిర్లక్ష్యం


చెత్తను తీసుకెళ్తున్న వాహనం

ఆమదాలవలస: మున్సిపాలిటీలోని పలు వార్డులలో సేకరించిన చెత్తను పట్టణ శివార్లలో డంపింగ్ యార్డుకు ట్రాక్టర్లకు తరలిస్తున్నప్పుడు కొందరు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వాహనంలోని చెత్త కిందకు పడకుండా టార్పాలిన్, వలలు వంటివి ఏర్పాటు చేయకపోవడంతో ఎక్కడపడితే అక్కడే చెత్త జారిపోతోంది. దీంతో దుర్వాసన వెలువడుతుండటంతో వాహనచోదకులు, స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాహనాల్లో చెత్త తరలించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

బాలికల భద్రతపై అవగాహన

సారవకోట : మహిళలు భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం సారవకోట కేజీబీవీ పాఠశాల ఆవరణలో సలహాల పెట్టె ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బాలికలకు భద్రత విషయంలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా బాక్స్‌లో వేయాలని సూచించారు. ప్రస్తుతం సైబర్ ఉచ్చులో పడి యువత, అమ్మాయిలు ఏ విధంగా బలైపోతున్నారో వివరించారు. కార్యక్రమంలో పోలీసులు, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు


ఇచ్ఛాపురం: క్రీస్తు బోధనలు వివరిస్తున్న పాస్టర్ జాన్సన్


ఇచ్ఛాపురం: ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు


సోంపేట: బారువ తీరంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: పట్టణంలోని పలు చర్చిల్లో ఆదివారం ఘనంగా ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. గొల్లవీధిలోని చర్చిలో పాస్టర్ జాన్సన్ మాట్లాడుతూ లోక రక్షణ కోసం మరణాన్ని జయించి మరోసారి ఈ భూమిపై యేసుక్రీస్తు అవతరించారని వివరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ ప్రత్తి అన్వేష్, ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి క్రైస్తవ సంఘం పెద్దలు పి.విజయ్‌కుమార్, ఎంవీఎస్ మూర్తి, వజ్రపు వెంకటేష్, తాతాజీ, సీహెచ్ లక్ష్మీనారాయణ, గోపాల్, కె.శివరావు, వీర్రాజు, జోష్‌కుమార్, దిలీప్, కిరణ్, సుధీర్, అమిత్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: బారువ ఫెయిత్ హోం చర్చి పాస్టర్ ఎ.జాన్ ఆధ్వర్యంలో బారువ సముద్ర తీరంలో ఆదివారం ఉదయం ఈస్టర్ పర్వదినం పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 50 రోజులుగా నిర్వహిస్తున్న ఉపవాస దీక్షను ముగించారు. కార్యక్రమంలో పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి


మాట్లాడుతున్న అగ్నిమాపకశాఖాధికారి మోహనరావు

సోంపేట: అగ్ని ప్రమాదాలు జరిగేటప్పుడు ప్రధాన పాత్ర పోషించడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని అగ్నిమాపకశాఖాధికారి ఎస్.మోహనరావు, సామాజిక సేవా కార్యకర్త జీవీ ఎస్‌మూర్తి అన్నారు. అగ్నిమాపక శాఖా కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాల ముగింపు వేడుకలు ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా అగ్ని ప్రమాదం జరిగేటప్పుడు వినియోగించే పరికరాలు గురించి వివరించారు. పలువురు సిబ్బంది, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


వజ్రపుకొత్తూరు: పూండిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–92 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల వద్ద కలుసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పట్లో విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. వారితో చదువుకొని మరణించిన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి – గోవిందపురం వివేకానంద విద్యాసంస్థల్లో 2000–2001లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలిశారు. 25 ఏళ్ల తర్వాత ఒకచోట సమావేశమై తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులు పి.సోమేశ్వరరావు, మెట్ట మోహనరావు, కె.ఆనందరావు, కె.ధర్మారావు, సీహెచ్ రవీంద్ర, రాంబాబు, శ్రీరామమూర్తిలను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాక్టర్ గుంట రాజశేఖరం, ప్రొఫెసర్ కె.సౌజన్య, శరత్, కణితి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో పూజలు


ఇచ్ఛాపురం రూరల్: మేళతాళాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు


కవిటి: పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ నర్తు రామారావు దంపతులు

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కలాంధ్రుల ఆరాధ్య దైవంగా లొద్దపుట్టి గ్రామంలో పూజలందుకుంటున్న ధనరాజ్ తులసమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంధ్రా, ఒడిశా నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి ఆలయం వద్ద మొక్కులు తీర్చుకొని బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన కాళికామాత, కోయ నృత్యాలు అలరించాయి.

కవిటి: మండలంలోని పుటియాదళలో ఉన్న ఎల్లమ్మ ఆలయ మండప ప్రతిష్ఠ ఉత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రగడపుట్టుగ తెలగ సంక్షేమ సంఘం కులపెద్ద ముత్యాల రామకృష్ణ, భాగ్యం దంపతుల ఆధ్వర్యంలో ప్రధాన పూజ జరిపారు. లోక కల్యాణార్థం లలితా సహస్రనామ సహిత కుంకుమార్చన, చండీహోమం చేపట్టారు. అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. పూజల్లో ఎమ్మెల్సీ నర్తు రామారావు, చామంతి దంపతులు, కడియాల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

యువత శ్రమదానం


శ్రమదానం చేస్తున్న యువకులు

నందిగాం: మండలంలోని పెంటూరులో అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మన గ్రామం మన శ్రమదానంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. నివాస గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించారు. అలాగే రహదారికి ఇరువైపులా శుభ్రం చేశారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు బంగారి ధర్మారావు, కార్యదర్శి తెంబూరు నర్సింహమూర్తి, కోదండరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు హార్మోనియం శిక్షణ


శిక్షణలో పాల్గొన్న చిన్నారులు

ఆమదాలవలస: చిన్నప్పటి నుంచే ఆధ్యాత్మికత అలవాటు చేస్తే, పిల్లల మనసు సేవాభావంతో నిండుతుందని సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర విద్యాజ్యోతి కో–ఆర్డినేటర్ ఎస్.గురుప్రసాద్ అన్నారు. ఆమదాలవలసలోని లక్ష్మీనగర్ వీధిలో సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్(బాబా మందిరం)లో ఆదివారం సాయిశ్రుతి మందిరం కన్వీనర్ కామావధానులు ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచిత హార్మోనియం శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించుకుపోతున్న కళలను బతికించేందుకు శిక్షణ ఇస్తున్నామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కార్యవర్గ సభ్యులు తమ్మన బంగారు రాజు, శేషగిరిశాస్త్రి, దామోదర్ తదిరతులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

వజ్రపుకొత్తూరు: రానున్న విద్యా సంవత్సరానికి ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో బి.వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. నిబంధన 12సీ ప్రకారం తల్లిదండ్రులు దీనిని పాటించాలని కోరారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసిన అనంతరం ఆయా పాఠశాలలను సంప్రదించాలని కోరారు.